ప్రజాశక్తి
మంగళవారం 6 ఫిబ్రవరి 2024 5 అనంతపురం

ఏపీ ఈసెట్ కన్వీనర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అనంతపురం

భానుమూర్తిని అభినందిస్తున్న విసి, తదితరులు

ఏపీ ఈసెట్-2024 కన్వీనర్‌గా ఆచార్య పిఆర్.భానుమూర్తి సోమవారం నాడు అనంతపురం జెఎన్‌టియు ఈసెట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యామండలి, జెఎన్‌టియు ఉపకులపతి జివిఆర్.శ్రీనివాస రావు , రెక్టార్ ఎం.విజయ కుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్‌లు తనపై నమ్మకం ఉంచి ఏపీ ఈసెట్-2024 కన్వీనర్‌గా నియమించినందుకు కతజ్ఞతలు తెలిపారు. ఈ భాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని తెలియజేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను విసి శ్రీనివాసరావు, రెక్టార్ విజయ కుమార్, రిజిస్ట్రార్ శశిధర్, యూనివర్సిటీ డైరెక్టర్లు సి.శోభాబిందు బి.దుర్గా ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ, వర్శిటీ పిఆర్‌ఒ ఎం.రామశేఖర రెడ్డి, దిలీప్ కుమార్, డిప్యూటీ రిజిస్ట్రార్ మధు సూధన రెడ్డి, తదితరులు అభినందనలు తెలిపారు.

'జనవరి ఒకటిన ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటించి, దాని ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తానని' ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా హామీనిచ్చారు. దీని ప్రకారం డీఎస్సీ భర్తీ కూడా ఉంటుందని నిరుద్యోగ యువత కలలు కన్నారు. ఆచరణలో ఈ ఐదు సంవత్సరాల్లో ఒక్క డీఎస్సీ రాలేదు. తాజాగా ఎన్నికలు సమీపించిన సమయంలో ప్రభుత్వం నోటిఫికేషన్ ఇస్తోంది. ఇందులో జిల్లాల వారీగా భర్తీ చేయబోయే పోస్టుల వివరాలు చూసి డీఎస్సీ కోసం సిద్ధమైన నిరుద్యోగుల్లో కడుపు మండుతోంది. మెగా డీఎస్సీ అన్న పేరుతో ఇచ్చిన నోటిఫికేషన్ దగా డీఎస్సీదని మండిపడుతున్నారు.

- ◆ ఐదేళ్లుగా 40 వేల మంది నిరీక్షణ
- ◆ నాలుగు ఎస్‌జిటిలు, 191 స్కూల్ అసిస్టెంట్ పోస్టులతో సరిపెట్టిన ప్రభుత్వం
- ◆ సర్కారు తీరుపై నిరుద్యోగుల ఆగ్రహం

మె(ద)గా డీఎస్సీ..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం ఉమ్మడి జిల్లా వరకు చూస్తే గుర్తించిన ఖాళీ పోస్టులు చూసి నిరుద్యోగులు నివ్వెరపోతున్నారు. కేవలం నాలుగు ఎస్‌జిటి, 191 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయనున్నట్టు సమాచారం తెలుసుకుని మండిపడుతున్నారు. ప్రధానంగా ఎస్‌జిటి కోసం సిద్ధమైన నిరుద్యోగుల్లో తీరని నిరాశ అలుముకుంది. ఇంటర్మీడియట్ తరువాత డిఇడి చేసి కేవలం ఉపాధ్యాయ వృత్తి చేయాలన్న ఆలోచనతోనే ఇన్నేళ్ల పాటు సిద్ధమవుతూ వస్తున్నారు.

ఇప్పుడు వీరందరి ఆశలపై నీళ్లు జల్లినట్టయింది. దీంతో వారందరూ రోడ్డుపైకి వస్తున్నారు. ఇన్నేళ్ల నీరక్షణ తరువాత ప్రభుత్వం ఈ రకంగా చేస్తుందా అంటూ మండిపడుతున్నారు. జిల్లాలో సుమారు 40 వేల మంది వరకు డీఎస్సీ కోసం ఎదురు చూసే నిరుద్యోగులున్నట్టు అంచనా. 2022 సంవత్సరంలోనే టెట్ పరీక్షకు హాజరైన వారే 28 వేల మంది ఉన్నారు. అంతకుమునుపు ఉత్తీర్ణులైన వారు దీని కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు.

ఐదేళ్లుగా సిద్ధమవుతున్నా..

సత్యసాయి జిల్లా మారుమూల గ్రామం మాది. ఉపాధ్యాయ వృత్తిలో చేరాలని ఇంటర్మీడియట్ తరువాత డీఎడ్ పూర్తి చేసి నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నాను. అందుకోసం అనంతపురం నగరంలో గది అద్దెకు తీసుకుని చదువుతున్నాను. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట తప్పడని ఎన్నో ఆశలతో ఎదురు చూస్తూ వచ్చాను. తీరా ఎన్నికల సమయం ఆసన్నమైందనగా ఇప్పుడు నోటిఫికేసన్ ఇచ్చారు. ఈ నోటిఫికేషన్‌లో కేవలం నాలుగు ఎస్‌జిటి పోస్టులే ఇచ్చారు. అందులోనూ ఒకటి కన్నడ, మరోకటి ఉర్దూ , మరో రెండు రిజర్వు కేటగిరిలో ఉన్నాయి. ఇక తమకు ఏ రకంగానూ ఉద్యోగమొచ్చే అవకాశమేలేదు. సాధారణంగా ఎప్పుడూ ఎస్‌జిటి పోస్టులు అధికంగా ఉండి స్కూల్ అసిస్టెంట్‌పోస్టులు తక్కువగా ఉండేవి. ఇప్పుడు ఇవి పూర్తిగా తగ్గించేయడంతో దీని కోసం సిద్ధమైన తమ జీవితాలు పూర్తిగా నాశనం అయ్యాయి.

రాజు , నిరుద్యోగ యువకుడు

ముఖ్యమంత్రి దేనికి 'సిద్ధం'

నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలుపుకోకుండా ఇప్పుడు సిద్ధమంటూ పర్యటనలను ముఖ్యమంత్రి చేపడుతున్నారు. ఆయన దేనికి సిద్ధమో చెప్పాలి. ప్రతి ఏటా ఇస్తామన్న జాబ్ క్యాలెండర్ ఎందుకు ప్రకటించలేదో చెప్పాలి. ఐదేళ్లుగా డీఎస్సీ కోసం నిరుద్యోగులు ఎదురు చూస్తూ వచ్చారు. దానికి కోసం ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటూ ఉన్నారు. 23 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తానని ఆరు వేలతో సరిపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లాలో చూస్తే ఎస్జీటీ నాలుగు పోస్టులు మాత్రమే ఉన్నాయి. దీని వలన నిరుద్యోగులు ఎంతో నష్టపోనున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి

డాక్టర్ గేయానంద్, మాజీ ఎమ్మెల్సీ

మాట నిలుపుకోమంటే కేసులా..?

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన మాటను నిలుపుకొమ్మని నిరసన తెలిపితే వారిపై కేసులు పెడుతున్నారు. కేసులు పెట్టి భయపెట్టే ప్రయత్నం చేయడం సరైంది కాదు. నాలుగున్నరేళ్లుగా నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నారు. ఇలాంటి వారిని ప్రభుత్వం మోసం చేయడం సరికాదు. ఇప్పటికైనా మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. ఇది కొత్తగా అడుగుతున్న డిమాండ్ కాదు...ఇచ్చిన మాటనే నిలుపుకొమ్మని కోరుతున్నాం.

బాలకృష్ణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి.

కలెక్టరేట్ ఎదుట రీడింగ్ ఛైర్స్ ఏర్పాటు చేసుకుని పుస్తకాలు చదువుతూ నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు

మెగా డీఎస్సీ కోసం

నిరుద్యోగుల నిరసనాగ్రహం

- ◆ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన
- ◆ భారీగా పాల్గొన్న నిరుద్యోగులు
- ◆ ప్రభుత్వం తీరుపై ఆగ్రహం
- ◆ మద్దతు తెలిపిన మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నామమాత్రపు డీఎస్సీ పోస్టులు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంపై నిరుద్యోగులు నిరసనాగ్రహం వ్యక్తం చేశారు. 'దగా డీఎస్సీ వద్దు.. మెగా డీఎస్సీ కావాలంటూ' అనంతపురంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కదం తొక్కారు. కలెక్టర్ కార్యాలయం వద్ద నిరుద్యోగులు రీడింగ్ ఛైర్స్ ఏర్పాటు చేసుకుని పుస్తకాలు చదువుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా, మెగా డీఎస్సీ విడుదల చేయాలంటూ నిరుద్యోగులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వీరి నిరసనకు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను మరోసారి మోసం చేసిందన్నారు. మెగా డీఎస్సీ అని ఊదరగొట్టి ఇప్పుడు ఎందుకూ పనికిరాని దగా డీఎస్సీని విడుదల చేసిందన్నారు. జూన్ నెలలో ఉద్యోగ విరమణ చేస్తున్న ఉపాధ్యాయులను కలుపుకుంటే దాదాపు 25వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటిన్నంటినీ భర్తీ చేసేలా ప్రభుత్వం డీఎస్సీని విడుదల చేయాలని కోరారు. అనంతపురం జిల్లాలో కేవలం నాలుగు పోస్టులతో డీఎస్సీని వదలారంటే రాష్ట్ర ప్రభుత్వానికి నిరుద్యోగులపై ఎలాంటి ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చున్నారు. ప్రస్తుతం అతి తక్కువ పోస్టులతో విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దు చేసి, పూర్తి స్థాయి పోస్టులు భర్తీ చేసేలా డీఎస్సీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలకష్ణ మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లుగా అదుగో మెగా డీఎస్సీ, ఇదిగో డీఎస్సీ అంటూ ఊదరగొట్టిన ప్రభుత్వం ఎన్నికల ముందు అతి సాధారణ పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం అత్యంత మోసకారి తనం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను అడుగడుగునా మోసం చేస్తోందన్నారు. ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేసేలా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించేంత వరకు నిరుద్యోగుల ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. నోటిఫికేషన్ కోసం ఆందోళన చేసిన నిరుద్యోగులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు నూరుల్లా, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, నాయకులు సిద్దుతో పాటు పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు పాల్గొన్నారు.

అర్జీలకు సకాలంలో పరిష్కారం

కలెక్టర్ ఎం.గౌతమి

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వివిధ సమస్యలపై స్పందన గ్రీవెన్స్‌లో ప్రజలు అందించే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్‌తో కలిసి 364 అర్జీలను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావివ్వరాదన్నారు. ఒకే సమస్య పదేపదే రాకుండా అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, డిఆర్‌ఒ జి.రామకృష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు నీలమయ్య, రవీంద్ర, ఆనంద్, సిపిఒ అశోక్‌కుమార్‌రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స.హ.చట్టాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వం చేస్తున్న ఖర్చు, చేస్తున్న అభివృద్ధి వివరాలను తెలుసుకోవాల్సిన బాధ్యత దేశంలోని ప్రతి పౌరుడిపై ఉందని సమాచార హక్కు చట్టం పరిరక్షణ సంఘం జిల్లా ప్రెసిడెంట్ ఎ.హొన్నూరప్ప సూచించారు. సోమవారం నగరంలోని ఎస్‌వి డిగ్రీ, పిజి కళాశాల జాతీయ సేవాసమితి యూనిట్ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు పౌరులకు ఏదైనా ప్రభుత్వ పనిని అధికారికంగా తనిఖీ చేయడానికి, ఉపయోగించిన మెటీరియల్ నమూనాను తీసుకునే హక్కు, అధికారం ఉందన్నారు. సమాచార హక్కు అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) ప్రకారం ప్రథమిక హక్కుల్లో భాగం అన్నారు. కళాశాల ఛైర్మన్ సి.సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సమాచార హక్కు ద్వారా దేశంలోని ఏ పౌరుడైనా ప్రభుత్వ అధికారం నుంచి కోరే అధికారం ఉందన్నారు. కావున పౌరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్‌ఛైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి, ప్రన్సిపల్ వై.మధుసూదన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసులు, ఎఒ శ్రీనాథ్, నబిరసూల్, గౌరవాధ్యక్షులు, ఎంఎస్ఎస్ అధికారులు జి.ఆనంద్‌బాబు, ఎస్.పురుషోత్తం, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి పతనం ఖాయం : కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం



చేనేతలకు నమస్కరిస్తున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

రానున్న ఎన్నికల్లో వైసిపి పతనం ఖాయమని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. సోమవారం పట్టణంలోని 7, 8వ వార్డుల్లో విస్తృతంగా పర్యటించి చేనేత వర్గానికి చెందిన ముఖ్యులను కలిశారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి-జనసేన కూటమి అధికారంలోకి రావాలని ప్రజలు బలంగా ఆకాంక్షిస్తున్నారన్నారు. తాను నియోజకవర్గంలో ఎక్కడ పర్యటించినా అన్నివర్గాల ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తోందన్నారు. జగన్‌రెడ్డి పాలనలో సర్వనాశనమైన రాష్ట్రానికి పూర్వ వైభవం తీసుకురావడం కోసం, మళ్లీ చంద్రబాబును గెలిపించడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ఇందుకు చేనేతలు స్పందిస్తూ రాయదుర్గంలో తనను గెలిపించడానికి శాయశక్తుల కృషి చేస్తామని చేనేతలు స్పష్టం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి శివ, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ జ్యోతి, రాష్ట్ర కుర్ని సాధికారిత కన్వీనర్ హనుమంతు, జనసేన ఇన్‌ఛార్జి మంజునాథగౌడ్, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, మండల కన్వీనర్ హనుమంతురెడ్డి, బిసి సెల్ అధ్యక్షుడు తిప్పయ్య, మల్లి, నాగరాజు, మాజీ వైస్‌ఛైర్మన్ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులకు మూడు మోటార్లు

◆రెండు బెంగుళూరుకు, ఒకటి హొస్పేటకు.. ◆నగరానికి తాగునీటి ముప్పు

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

మరమ్మతుకు గురైన మోటార్

అనంతపురం నగరానికి తాగునీటిని అందించే పిఎబిఆర్ తాగునీటి పథకంలోని నాలుగు మోటార్లలో మూడు పాడైపోయాయి. మూడు మోటార్లు ఒక్కసారిగా మరమ్మతుకు గురికావడంతో నగరానికి తాగునీటి గండం కన్పిస్తోంది. నగరం నీటి సరఫరాకు సంబంధించి ప్రస్తుతం ఒక 500 హెచ్‌పి మోటర్ మాత్రమే పని చేస్తోంది. ఇది కూడా పోతే నీటి సరఫరా మొత్తం నిలిచిపోయే ప్రమాదం కన్పిస్తోంది. మరమ్మతుకు గురైన వాటికి సంబంధించి రెండు మోటార్లను బెంగుళూరుకు, ఒకదానికి హొస్పేట్‌కు పంపినట్లు తెలుస్తోంది. మోటార్లు మరమ్మతుకు గురికావడంతో మూడు లక్షల పైబడిన నగర జనాభాకు తాగునీటి సరఫరాలో ప్రమాద గంటికలు మోగుతున్నాయి. ఏళ్ల తరబడి మోటార్లు పాడైపోయిన మరమ్మతులను సకాలంలో చేపట్టపోవడంతో ఈ దుస్థితికి కారణమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు కార్పొరేషన్‌లో ముందు నుంచి పనిచేస్తున్న అధికారులు సైతం తాగునీటి పథకాన్ని పర్యవేక్షించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు తెలుస్తోంది. చెడిపోయిన మోటార్లను వెనువెంటనే మరమ్మతు చేయకుండా అలాగే వదిలేశారు. వాటర్ వర్క్స్ ఇంజినీర్లుగా పనిచేస్తున్న కొందరి కాసుల కక్కుర్తి సమస్యను మరింత జఠిలం చేస్తోంది. ఉన్నతాధికారులు సైతం తరచూ పిఎబిఆర్ డ్యాంను సందర్శించకపోవడం కూడా సమస్యకు కారణం అవుతోంది. డ్యాంలో ఆలం ఫ్లోరిన్ బ్లీచింగ్ తదితర నీటి శుద్ధి సామగ్రి కొనుగోలులో సైతం అక్రమలు జరుగుతున్నట్లు పెద్దఎత్తున విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కంచేచేను మేసినట్టుగా పాలకులు కూడా పర్సేంటేజీలకు అలవాటు పడడం మరిన్ని సమస్యలను తెచ్చి పెడుతోంది. ఏది ఏమైనా అధికారులు, పాలకుల నిర్లక్ష్యం, అవినీతి కారణంగా నగరానికి నీటి ప్రమాద ఘంటికలు మోగే పరిస్థితులు కన్పిస్తున్నాయంటూ నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి తదితరులు

నులిపురుగులను నిర్మూలిద్దాం

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులి పురుగులను నిర్మూలించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి పేర్కొన్నారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ఈ నెల 9 నుంచి 16వ తేదీ వరకు జరిగే కార్యక్రమంలో పిల్లలకు అల్బెండజోల్ 400 మిల్లీగ్రాముల మాత్రను వేయనున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, డిఆర్‌ఒ జి.రామకష్ణారెడ్డి, డిఎంహెచ్‌ఒ డా॥ఈబి.దేవి, ప్రాజెక్ట్ ఆఫీసర్ జి.నారాయణస్వామి, డిప్యూటీ కలెక్టర్లు నీలమయ్య, రవీంద్ర, ఆనంద్, ఆర్‌బిఎస్‌కె మేనేజర్ డి.రజిత పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

కమిషనర్ మేఘ స్వరూప్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ మేఘ స్వరూప్

సురక్షిత ప్రమాణాలు పాటించడంతోపాటు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని కమిషనర్ మేఘ స్వరూప్ కార్మికులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థలో ఉన్న మూడవ సర్కిల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మేఘస్వరూప్ మాట్లాడుతూ విధుల్లో పాల్గొనేటప్పుడు ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించకూడదన్నారు. బూట్లు, గ్లౌజ్‌లు తదితర రక్షణ వస్తువులను వాడాలన్నారు. వేకువ జామునే విధులకు హాజరై నగర పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నగర సుందరీకరణ, పారిశుధ్యం మెరుగులో కార్మికులది కీలక పాత్ర అన్నారు. ఇందులో భాగంగా విధులకు ఆలస్యంగా వచ్చిన వారిని హెచ్చరించారు. అనంతరం పారిశుధ్య పర్యవేక్షణ విధులకు గైర్హాజరైన 45, 46, 48వ వార్డుల శానిటేషన్ కార్యదర్శులకు నోటీసులు జారీ చేశారు. అనంతరం నగరంలోని అరవింద్‌నగర్, ఆదర్శకాలనీ, హమాలీకాలనీ, నవోదయ కాలనీ, కలెక్టరేట్, తదితర ప్రదేశాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమాల్లో శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఆంజనేయులు, సచివాలయ, పారిశుధ్య కార్యదర్శులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

'శ్రీరామిరెడ్డి' కార్మికులకు బకాయిలు చెల్లించాలి

10 నుంచి నిరవధిక సమ్మె - కలెక్టర్ ఎం.గౌతమికి సిఐటియు నేతల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకం కింద కళ్యాణదుర్గం డివిజన్‌లో పని చేస్తున్న కార్మికులకు బకాయి పడ్డ 4 నెలల వేతనాలు, 15 నెలల పిఎఫ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు సమస్యల పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో జిల్లా కలెక్టర్ ఎం.గౌతమిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు అందక వారి కుటుంబాలు కడవటం కష్టాంగా మారిందన్నారు.

పిల్లల చదువులు, ఇంటి అద్దెలు, విద్యకు సంబంధించి ఫీజులు చెల్లించలేని దుస్థితిలో ఆందోళన పడుతున్నారని తెలిపారు. సమస్యలపై డిసెంబర్‌లో 22 రోజుల పాటు శాంతియుత నిరసనలు చేపట్టామని, ఆ క్రమంలో కార్మిక సంఘాలతో అధికారులు చర్చలు జరిపి జనవరిలో వేతనాలు, పిఎఫ్ చెల్లింస్తామని సమ్మె విరమింపజేశారన్నారు. అయితే ఫిబ్రవరి నెల వచ్చినా ఇంత వరకు వేతనాలు చెల్లించలేదన్నారు. తక్షణమే వేతనాలు, పిఎఫ్ బకాయిలు చెల్లించాలన్నారు. లేనిపక్షంలో ఈనెల 10వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి కార్మికులు వెళ్తున్నట్లు విన్నవించారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ ఆలోపు వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకం యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాము, ఆర్గనైజర్ అశోక్, కోశాధికారి వన్నూర్‌స్వామి, నాయకులు హనుమంతురెడ్డి, బిఎస్.రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు తహశీల్దార్ల బాధ్యతలు స్వీకరణ

శింగనమల : మండల నూతన తహశీల్దార్‌గా కె.శోభన్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేస్తున్న తహశీల్దార్ ఈశ్వరమ్మను అన్నమయ్య జిల్లాకు బదిలీ చేయగా కడప జిల్లా రైల్వేకొండాపురంలో పని చేస్తున్న శోభన్‌బాబును ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్‌రావు, సీనియర్ అసిస్టెంట్ వెంకట్రామిరెడ్డి, మండల సర్వేయర్ గోవిందరాజులు, వీఆర్వో తాతయ్య, వీఆర్‌ఏలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల నూతన తహశీల్దార్‌గా హెచ్.హరినాథరావు సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేసున్న తహశీల్దార్ డి.ఓబులేసును బదిలీ చేసి కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో పనిచేస్తున్న హరినాథరావును ఇక్కడిని బదిలీ చేశారు. ఈసందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ హుస్సేన్‌పీరా, సీనియర్ అసిస్టెంట్ శర్మ, వీఆర్వోలు, సిబ్బంది, స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

గార్లదిన్నె : మండల నూతన తహశీల్దార్‌గా లోకేశ్వరి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా గార్లదిన్నెలో పనిచేస్తున్న తహశీల్దార్ ఉషారాణిని తిరుపతికి బదిలీ కావడంతో చిత్తూరు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న లోకేశ్వరి గార్లదిన్నెకు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయ సిబ్బంది తహశీల్దార్‌కు స్వాగతం పలికారు.

రాయదుర్గం రూరల్ : రాయదుర్గం తహశీల్దార్‌గా చిట్టిబాబు, ఎంపిడిఒగా అల్లాబకాష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లా నుంచి తహశీల్దార్, కర్నూలు జిల్లా నుంచి ఎంపిడిఒ ఇక్కడికి వచ్చారు. దీంతో వీరికి ఆయా కార్యాలయాల సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంల్లో ఇఒఆర్‌డి రంగనాయకులు, ఎపిఒ నీరజ, సీనియర్ అసిస్టెంట్ రవిచంద్ర ఆజాద్, జూనియర్ అసిస్టెంట్ రాజసింహా, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం సమర్పిస్తున్న వికలాంగులు

పింఛన్ సొమ్ము పెంచాలి

పామిడి : దివ్యాంగుల పింఛన్‌ను పెంచాలని కోరుతూ విశాల ఫెర్రర్ వికలాంగుల మండల సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ పనీ చేయలేని తమకు కుటుంబ పోషణ నిమిత్తం పింఛన్ సొమ్మును పెంచాలని కోరారు.

ఇంటి స్థలాలు ఇవ్వాలని వినతి

వికలాంగులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. మండలంలో వికలాంగులకు రేషన్‌కార్డు, వివాహంతో సంబంధం లేకుండా ప్రతి వికలాంగునికీ 3 సెంట్ల స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో విశాల ఫెర్రర్ వికలాంగుల మండల సమాఖ్య అధ్యక్షుడు కేశవాచారి, నీలూరు సుధాకర్‌రెడ్డి, వంకరాజుకాలువ నాగభూషణ, వడ్ల సర్వేస్, మాతాకు శివన్న, ఓబుళపతి, పర్వీన్, ఓంప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె ఎస్ఐగా గౌస్ మహమ్మద్‌బాషా



గార్లదిన్నె : మండల నూతన ఎస్ఐగా ఎస్.గౌస్‌మహమ్మద్‌బాషా సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ సాగర్ తాడిపత్రి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కావడంతో అక్కడ పనిచేస్తున్న గౌస్‌మహమ్మద్‌బాషా గార్లదిన్నెకు వచ్చారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

In the Court of the Addl.Senior Civil. Judge: Anantapuramu.
I.P.No:92/2022 along with I.A.No:138/2022

Between
K.Rambhupal Naidu and another. **...Petitioners**
And
S.Fakruddin and another. **...Respondents**

Notice To Respondent No-1

Shaik Fakruddin, S/o Late. Khasimsab, Garladinne Village & Mandal, Ananntapuramu District.

Whereas the above named petitioner has filed I.P.No.92/2022 along with I.A.No.138/2022 to this court. The Respondent No-1 is hereby warned to appear In this court In person or by pleader duly instructed on the 13-02-2024 at 10-30 AM to show cause against the applications falling wherein, the said applications will be heard and determined Ex Parte and it will be presumed that you consent to.

(By Order of The Court)
G.Sreenivasa Kumar,
Advocate for petitioner.
Anantapuramu.Mob.99848188729.

నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్లకు వినతి

ప్రజాశక్తి-పుట్లూరు

గత ఖరీఫ్, రబీ సీజన్లలో పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించడంతోపాటు పంట రుణాలు మాఫీ చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్‌ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 ఖరీఫ్, రబీ సీజన్లలో వర్షాభావం కారణంగా రైతులు అన్ని రకాల పంటలు నష్టపోయారన్నారు. అలాగే హెచ్చెల్సీ కింద సాగు చేసిన పంటలు సైతం అధికారులు, నాయకుల నిర్లక్ష్యంగా ఎండిపోయాయన్నారు. సమయానికి నీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈనేపథ్యంలో కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో చాలామంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క 2023లోనే ఇప్పటి వరకూ 48 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. కావున నష్టాల్లో కూరుకుపోయిన రైతులకు తక్షణం ఎకరాకు రూ.50 వేలు పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలిన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి జి.వెంకట్‌చౌదరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సూరి, రైతుసంఘం నాయకులు భాస్కర్‌రెడ్డి, పెద్దయ్య, నాగభూషణం, శ్రీనివాసులు, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.



పుట్లూరులో డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

పామిడి : పంట నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ ఖరీఫ్, రబీ సీజన్లలో వేరుశనగ, కంది, పత్తి, ఆముదం, జొన్న, కొర్ర, మొక్కజొన్న, సజ్జ, పొద్దుతిరుగుడు, మినుములు, పెసలు, అలసంద, సోయాబీన్, తదితర పంటలు, రబీలో పప్పుశనగ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వెంటనే ఆయా రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో ఈనెల 7న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాబా ఫక్రుద్దీన్, ముత్యాలు, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నెలో వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

గార్లదిన్నె : ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ 2023 ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలు తీవ్ర వర్షాభావం ఏర్పడి ఎండిపోయాయని తెలిపారు. వారికి వెంటనే ఎకరాకు రూ.50వేల ప్రకారం పరిహారం చెల్లిండంతోపాటు పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి చెన్నారెడ్డి, నాగమ్మ, నల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఉప తహశీల్దార్ వెంకటేశ్వరమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి దస్తగిరి, రైతుసంఘం అధ్యక్షులు ఈశ్వరరెడ్డి, నారాయణ, నరసమ్మ, తిప్పన్న, చిదంబరరెడ్డి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



పామిడి, పెద్దవడుగూరులో అధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : డీఎస్పీ

ప్రజాశక్తి-బెలుగుప్ప

త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని బెలుగుప్ప పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించారు ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో చిన్న చిన్న వాటికి తగాదాలకు వెళ్లకుండా పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎస్ఐ శివకు సూచించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు శివ, రామదాసు, దేవదాసు, జమేదారు బాల నరసింహులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి

ఉరవకొండ : విడపనకల్-కర్ణాటక రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్రమ మద్యం, డబ్బులు రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, విడపనకల్ ఎస్ఐ ఖాజాహుస్సేన్, సెబ్ ఎస్ఐ మధుసుదన్‌రెడ్డి, కమర్షియల్ టాక్స్ సిబ్బంది, పోలీస్, సెబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎంఇఒకు వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు

మెనూఛార్జీలు పెంచాలని వినతి

బొమ్మనహాల్ : మధ్యాహ్న భోజన మెనూ ఛార్జీలను పెంచాలని సిఐటియు ఆధ్వర్యంలో వంట ఏజెన్సీ నిర్వాహకులు సోమవారం మండల కేంద్రంలో ఎంఇఒకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు అధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వంట ఏజెన్సీలకు రూ.20 పెంచాలని, ఏజెన్సీ నిర్వాహకులకు గౌరవ వేతనం ఇవ్వాలని, మరణించిన వారికి మట్టి ఖర్చులు చెల్లించాలని, వంటగ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వంట ఏజెన్సీ నిర్వాహకులు గోవిందవాడ హొన్నూరుస్వామి, బొమ్మనహాల్ మాధవి, ఉద్దేహాళ్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

19వ వార్డులో 'మెట్టు' పర్యటన

రాయదుర్గం : వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి సోమవారం పట్టణంలోని 19వ వార్డులో పర్యటించారు. 'వాక్ విత్ మెట్టు' కార్యక్రమంలో భాగంగా వార్డు ప్రజలను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప, వార్డు సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, వార్డు ఇన్‌ఛార్జిలు, వైసిపి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి

సీమ దుర్భిక్షమే 'సాధన'

సాహిత్య విమర్శకులు కె.నాగేశ్వరాచారి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయలసీమ జీవన విధానం, దుర్భిక్ష పరిస్థితులపై ఒక హెచ్చరికే డాక్టర్ శాంతి నారాయణ రచించిన 'సాధన' నవల అని సాహిత్య విమర్శకులు కె.నాగేశ్వరాచారి అన్నారు. సోమవారం మండలంలోని 74-ఉడేగోళంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖధిపతి డాక్టర్ కె.లక్ష్మీనారాయణ అధ్యక్షతన సాధనన నవల పరిచయ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధన నవలలో రాయలసీమ, కోస్తా ప్రాంతాల మధ్య జీవన విధానం, ప్రమాణాల్లో ఉన్న తేడాలను రచయిత శాంతి నారాయణ కళ్లకు కట్టినట్లు వివరించారన్నారు. రచయిత డాక్టర్ శాంతి నారాయణ మాట్లాడుతూ తన సాహిత్య రచనకు అంకురార్పణ, దోహద పడింది రాయదుర్గంలో ఉపాధ్యాయులుగా పనిచేసిన కాలంలోనే అన్నారు. సీమ దుర్భిక్షం, జీవన విధానంపై కోస్తా వారి చిన్నచూపు తన నవలలో చూపించినట్లు తెలిపారు. గతంలో కోస్తా నాయకులు చేసిన దుర్మార్గమే నేటి రాయలసీమ దుస్థితికి కారణమన్నారు. రాబోయే ఎన్నికల్లో వచ్చే రాజకీయ నాయకులను ఈ విషయమై నిలదీయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కవి ఉప్పరపాటి వెంకటేశులు, కళాశాల కమిటీ సభ్యులు బసవరాజు, అధ్యాపకులు నారాయణ, విశ్రాంత అధ్యాపకులు ఆయూబ్‌ఖాన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సాహిత్య విమర్శకులు కె.నాగేశ్వరాచారి

మౌలిక వసతుల కల్పనకు కృషి : ఎమ్మెల్యే వైవిఆర్

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుత్తి : రాష్ట్రంలోని ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే సిఎం జగన్ లక్ష్యమని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. సోమవారం రూ.63 లక్షలతో చెట్నేపల్లి నుంచి బేతాపల్లి వరకూ మంజూరైన తారు రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రజల సౌకర్యార్థం గ్రామాలకు తారు రోడ్లు నిర్మించామన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని సిసి రహదారులు, మురుగు కాలువలు నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జి.విశాలాక్షి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ వన్నూరుబీ, పిఆర్ డిఇఇ డిఎల్.మురళీధర్, వైసిపి మండల కన్వీనర్ జి.గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు క్రషర్ మధుసూదన్‌రెడ్డి, గురుప్రసాద్‌యాదవ్, రామ రంగారెడ్డి, మైనుద్దీన్, వై.సుభాస్‌రెడ్డి, ఎం.రంగస్వామి, కౌన్సిలర్లు రూతమ్మ, వాల్మీకి శివరాం, వరదరాజులు, ఫారూక్, కెవి.రమణ, వెంకటసుబ్బయ్య, నరేష్, అరవింద్, ఖాజాఖాన్, సర్పంచులు చిన్న ఆంజనేయులు, ఎ.లహరిరెడ్డి, గోపాల్, గురుమస్తాన్, నాయకులు ఎ.సూర్యనారాయణరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, హనుమంతు, సివి.రంగారెడ్డి, రమేష్‌రెడ్డి, కొత్తపేట రాము, డి.షఫీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు

ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాలకే ప్రభుత్వ సేవలు తెచ్చామని ప్రభుత్వ సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. సోమావారం మండలంలోని మండలం బొమ్మలాటపల్లిలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, డాక్టర్ వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ నూతన భవనాలతోపాటు కొర్రపాడు వద్ద రూ.2.6 కోట్లతో నిర్మించిన నూతన విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థలను తీసుకొచ్చి గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు అందిస్తున్న ఏకైక సిఎం జగన్ అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందన్నారు. వీటిని జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయన్నారు. వీటిని ప్రజలు తిపికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, అధికారులు, వైసిపి నాయకులు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

శింగనమల : మండలంలోని లోలూరు, రఘునాథపురం, ఆకులేడు, మదిరేపల్లి, గురుగుంట్ల, నాగులగుడ్డం, నాగులగుడ్డం తండా, నరసాపురం, చిన్న జలాలపురం, నాయనవారిపల్లి, ఇరువెందుల, రాచేపల్లి, నిదనవాడ, ఆనందరావుపేట, తరిమెల, కల్లుమడి, గుమ్మేపల్లి, ఏకులనాగేపల్లి, గ్రామాల్లో ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి వైసిపి సమన్వయకర్త ఎం.వీరాంజనేయులు పర్యటించారు. ఇందులో భాగంగా గ్రామాల్లోని నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, బొమ్మన భాస్కర్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, నాగవర్ధన్‌రెడ్డి, గంగన్న, ఎంపిపి యోగేశ్వరి, శివ, ముచ్చుకోట శ్రీకాంత్‌రెడ్డి, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే టిడిపికి బలం : ప్రభాకర్‌చౌదరి

అనంతపురం కలెక్టరేట్ : కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలమని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి అన్నారు. సోమవారం 26వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన టిడిపి కార్యాలయాన్ని ప్రారంభించారు. ముందుగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన 70 రోజుల్లో ఎన్నికలు రానున్న నేపథ్యంలో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో టిడిపి జెండాను ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి దేవళ్లమురళి, 26వ డివిజన్ అధ్యక్షుడు తమ్మినేని వేణుగోపాల్, తలారి ఆదినారాయణ, గాజుల ఆదెన్న, సరిపూటి రమణ, సుధాకర్‌యాదవ్, బొమ్మినేని శివ, ముక్తియార్, జెఎం.బాషా, పరమేష్, పూల బాషా, గొల్ల సుధాకర్‌నాయుడు, విజయశ్రీరెడ్డి, సంఘ తేజస్విని, కృష్ణవేణి, వసుంధర, జానకి, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో కర్నాటక వాసి మృతి

మృతిచెందిన పాల్‌శర్మ

కుందుర్పి : మండల పరిధిలని అల్లాపురం గ్రామం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనండతో కర్ణాటకకు చెందిన ఎస్.పాల్‌శర్మ (45) మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే... కర్ణాటక రాష్ట్రం పరసాపురం పంచాయతీ కొర్లకుంట గ్రామానికి చెందిన పాల్ శర్మ (45) ఆదివారం కుందుర్పి మండలం బసాపురం గ్రామానికి చెందిన స్నేహితుడి వద్దకు వచ్చాడు. అనంతరం తిరిగి అన్న కూతురిని పలకరించడానికి కనుకూరు వస్తుండగా అల్లాపురం గ్రామం వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నట్లు తెలిపారు.

హత్యకుట్ర భగ్నం..నిందితుడి అరెస్టు

తాడిపత్రి రూరల్ : ప్రియుడితో కలిసి భర్తను హతమార్చడానికి పన్నాగం పన్నిన ఓ హత్యాప్రయత్నాన్ని తాడిపత్రి రూరల్ పోలీసులు భగ్నం చేశారు. కుట్రలో భాగమైన వ్యక్తిని అరెస్టు చేశారు. సోమవారం రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సీఎం గంగయ్య మాట్లాడుతూ ఉరవకొండకు చెందిన ఓ వివాహిత గుంతకల్లు మండలం నక్కనదొడ్డి గ్రామానికి చెందిన భాస్కర్‌తో మూడేళ్ల నుంచి ఫేస్‌బుక్‌లో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఇద్దరూ ఎక్కువ చనువుగా ఉంటున్న వివాహిత భర్త, ముగ్గురు పిల్లలతో కలిసి తాడిపత్రిలో కాపురం పెట్టింది. ఈనేపథ్యంలో భాస్కర్‌తో చనువుగా ఉంటున్నట్లు తెలుసుకున్న వివాహిత భర్త నాగరాజు మద్యం తాగి భార్యతోపాటు భాస్కర్‌తో గొడవ పడేవాడు. ఈక్రమంలో నాగరాజును ఎలాగైనా కడతేర్చాలని భావించిన భాస్కర్ తనకు పరిచయం ఉన్న చాలామందితో చర్చించాడు. అందుకు ఎవరూ సహకరించకపోవడంతో తానొక్కడే కొడవలితో నరికి చంపాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా తాడిపత్రి రూరల్ పరిధిలోని గన్నివారిపల్లి కాలనీలో ఉన్న సాయి లక్ష్మి అపార్ట్మెంట్ దగ్గర ఉన్న అంగడిలో బీడీల కోసం నాగరాజు వస్తాడని తెలుసుకున్న భాస్కర్ సోమవారం ఉదయం అపార్ట్మెంట్ దగ్గర కొడవలితో సిద్ధంగా ఉన్నాడు. సమాచారం అందుకున్న తాడిపత్రి రూరల్ యుపిఎస్ సిఐ లక్ష్మీకాంత్‌రెడ్డి సిబ్బందితో వెళ్లి భాస్కర్‌ను అరెస్టు చేసి ఆరాతీయగా హత్యకు కుట్ర పన్నినట్లు తేలిందన్నారు. హత్య కుట్ర భగ్నం చేసిన తాడిపత్రి రూరల్ పోలీసులను ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ అభినందించారు. ఈ సమావేశంలో రూరల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగయ్య

జూదరులు అరెస్టు

పుట్లూరు : మండల పరిధిలో కడవకల్లు గ్రామ సమీపంలో జూదమాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. పక్కాగా అందిన సమాచారం మేరకు జూదమాడుతున్న వారిపై దాడిచేసి అరెస్టు చేయడంతోపాటు రూ.1,360 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గెలుపు కోసం ఐక్యతగా కృషి చేద్దాం

ఎంపీ తలారి రంగయ్య

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

పార్టీ అభివృద్ధితో పాటు అభ్యర్థి విజయం కోసం ఐక్యతా భావంతో కృషి చేద్దామని ఎంపీ తలారి రంగయ్య అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, వాలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా కంబదూరు మండల కేంద్రంలోని మల్లేశ్వర స్వామి ఆలయంలో మండల నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్గవిభేదాలను పక్కనపెట్టి వచ్చే ఎన్నికల్లో జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మున్సిపల్ వైస్‌ఛైర్మన్ జయం, ఫణి, తిప్పేస్వామి, బాబురెడ్డి, తిమ్మరాయుడు, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రంగయ్య

తాగునీటి సమస్య పరిష్కరించాలి : ఎంపిపి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి రాఘవరెడ్డి

పుట్లూరు : వేసవికాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడకుంటా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపిపి రాఘవరెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ వర్షాలు తక్కువ కురిసిన నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొనే అవకాశం ఉందన్నారు. కావున అధికారులు అలాంటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ దస్తగిరి, ఇఒఆర్‌డి అనంతప్రసాద్, డిటి మల్లేష్‌ప్రసాద్, ఏవో కాత్యాయని, వైద్యాధికారి శ్రీవాణి, ఎంఇఒలు శ్రీదేవి, ప్రేమ్‌కుమార్, ఎటిఎం వెంకట్రామిరెడ్డి, ఎపిఒ చెన్నకేశవులు, ఎంపిటిసిలు, సర్పంచులు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ

కళ్యాణదుర్గం : మెగా డీఎస్సీకి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్షలాదిమంది నిరుద్యోగ యువత ఉద్యోగ ఉపాధి కోసం నిరీక్షిస్తుంటే కేవలం 6100 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం సిగ్గుచేటు అన్నారు. ప్రస్తుతం 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వాటన్నింటికీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

సిపిఎం క్యాలెండర్ ఆవిష్కరణ

సిపిఎం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి

డి.హీరేహాల్ : సిపిఎం రూపొందించిన నూతన క్యాలెండర్‌ను ఆదివారం మండల కేంద్రంలో ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కర్యాక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి లోకేష్, రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున, హమాలీ సంఘం అధ్యక్షులు పెద్దన్న, లింగన్న, వెంకటేశులు, ఎర్రిస్వామి, రామయ్య, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులే నిజమైన హీరోలు

కుందుర్పి : విద్యార్థులకు తల్లిదండ్రులే నిజమైన హీరోలు అని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు లక్ష్మీపురం వేణుగోపాల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కిష్టప్ప అధ్యక్షతన టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా ఎస్కే ఛారిటబుల్ ట్రస్టు, వదాన్య జనసొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్టు విజేలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్కే ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు లెనిన్‌బాబు, ఇన్ఫినిటీ స్వచ్ఛందసేవా సంస్థ వ్యవస్థాపకులు బద్దేనాయక్, దుర్గంరక్తదాతల సంస్థ అధ్యక్షులు కంబాల తిమ్మారెడ్డి, ఎంఇఒలు ఓబుళపతి, తిప్పేస్వామి, జ్యోతిబాపులే గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, రుషి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అరుణ, వదాన్య జన సొసైటీ ప్రతినిధి రాము, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు కృషి



రికార్డులను పరిశీలిస్తున్న ఓబులు

ఉరవకొండ : మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మలేరియా నివారణ ఓబులు సూచించారు. సోమవారం విడపనకల్లు, పెద్దకొట్టాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి హాజరు పట్టికతోపాటు రికార్డులను పరిశీలించారు. ఇందులో భాగంగా రోజూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోగులు ఎంతమంది వస్తున్నారు.. ఎంతోమందికి జ్వర పీడితులు ఉన్నారు.. రక్త నమోనాలు సేకరిస్తున్నారా.. లేదా.. అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఇన్‌ఛార్జి, అదనపు మలేరియా అధికారి జి.గిరిధర్‌రెడ్డి, ఉరవకొండ డివిజన్ మలేరియా నివారణ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ కంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి

ఆందోళన చేస్తున్న మృతుల బంధువులు

ఉరవకొండ : మండలంలోని బుదగవి గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రామాంజనేయులు, దాసరి రాజు కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని కోరుతూ సోమవారం ఉరవకొండ పోలీస్‌స్టేషన్ ముందు మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేస్త్రీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న ఇద్దరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. వెంటనే వారి కుటుంబాలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇందుకు స్పందించిన సిఐ తిమ్మయ్య బాధితులతో చర్చించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రోగికి ఆర్థిక చేయూత

సాయం అందజేస్తున్న బద్దేనాయక్

కుందుర్పి : అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని కదరంపల్లి గ్రామానికి చెందిన గాయత్రికి ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్ సోమవారం ఆర్థిక చేయూతనందించారు. గాయత్రి థైరాయిడ్, గుండెపోటు జబ్బులతో బాధపడుతున్నట్లు సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న బద్దేనాయక్ రూ.8వేలు వెచ్చించి మూడు నెలలకు సరిపడ నిత్యావసర సరుకులను అందజేశారు. అంతేగాకుండా ఆరోగ్య అవసరాల నిమిత్తం రూ.10వేలు ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో తిప్పేస్వామి, రాము, సాయినాథ్, మహాలింగ, గ్రామస్తులు మనోహర్, కేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న శిల్ప

రాయదుర్గం : పట్టణంలోని 17వ సచివాలయాన్ని పురపాలక సంఘం అధ్యక్షులు పొరాళు శిల్ప, వార్డు సభ్యులు భాగ్యలక్ష్మి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, వార్డు ఇన్‌ఛార్జి పొరాళు శివ, కృష్ణమూర్తి, ఇస్మాయిల్, దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

అశ్వర్థంలో ఏర్పాట్లు పరిశీలన

ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిఐ, ఎస్ఐలు

పెద్దపప్పూరు : మండలంలో వెలసిన అశ్వర్థ నారాయణస్వామి, భీమలింగేశ్వర స్వామి ఉత్సవాల ఏర్పాట్లను యాడికి సిఐ, ఎస్ఐ శరత్‌చంద్ర, ఆలయ ఇఒ సుబ్రమణ్యం సోమవారం పరిశీలించారు. ఈనెల 10న మాఘమాసం ప్రారంభం కానున్న నేపధ్యంలో భక్తులు భారీగా తరలిరానున్నారు. ఇందులో భాగంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇఒ తెలిపారు.

అక్రమ అరెస్టులకు భయపడం

శింగనమల : ప్రభుత్వ అక్రమ అరెస్టులకు భయపడేది లేదని పంచాయతీరాజ్ ఛాంబర్ కార్య నిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. సర్పంచుల హక్కులను కాపాడాలని, సర్పంచులకు వచ్చే నిధులను వారికే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6న పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో చలో అసెంబ్లీకి పిలుపునిస్తే నాయకులను ఎక్కడికక్కడ అరెస్టులకు పాల్పడటం బాధాకరమన్నారు. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా అధిగమించి చలో అసెంబ్లీ నిర్వహించి తీరుతామన్నారు.

'సిద్ధం'ను జయప్రదం చేద్దాం

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగర సమీపంలో జరగనున్న సిద్ధం కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని నగర మేయర్ మహమ్మద్ వసీం పిలుపునిచ్చారు.నగర పాలక సంస్థ కార్యాలయంలో సిద్ధం కార్యక్రమం పోస్టర్ ను నగర మేయర్ మహమ్మద్ వసీం డిప్యూటీ మేయర్లు వాసంతి , విజయ భాస్కర్ రెడ్డితో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా మేయర్ మహమ్మద్ వసీం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలంతా వైసిపికి ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్న సిద్ధం బహిరంగ సభకు నగరం నుండి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వెళదామని పిలుపునిచ్చారు.ఆ దిశగా కార్పొరేటర్లు, నాయకులు చొరవ తీసుకోవాలని సూచించారు.రాబోయే ఎన్నికల్లో వైసిపిదే విజయమని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, బాలాంజినేయులు, సైపుల్లా బేగ్,కమల్ భూషణ్,అనిల్ కుమార్ రెడ్డి,లాలూ,సుజాత, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

సిద్ధం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

గురుకుల, కస్తూరిబా పాఠశాలల తనిఖీ

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలోని కస్తూరిబా గాంధీ, అంబేద్కర్ గురుకుల పాఠశాలలను ఎంపిపి నరసింహులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయుల హాజరు పట్టిక, వంటశాల, మరుగుదొడ్లను పరిశీలించారు. తర్వాత భోజన నాణ్యతను పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో తాగునీరు, విద్యుత్తు, డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని విద్యార్థులు ఎంపిపి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ సిఎం జగన్ విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. దేశంలో ఏరాష్ట్రంలో లేనివిధంగా పెద్ద ఎత్తున నిధులు కేటాయించారన్నారు. సిఎం ఆశయాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా గాంధీ పాఠశాల ప్రిన్సిపల్ ధనలక్ష్మి, అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సునీత, గురుకుల పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎంపిపి నరసింహులు

ఘనంగా స్పోర్ట్స్‌డే

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం నగరంలోని హౌసింగ్ బోర్డ్‌లో ఉన్న ఎటిపి-8లో అన్యువల్ మీట్ స్పోర్ట్స్ డేను సోమవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి హాజరై ఆటల్లో విజయం సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్యార్థులకు మానసిక శారీరక ఉల్లాసాన్ని కలిగించే ఆటలతో కూడిన విద్య ఎంతో అవసరం అన్నారు. ఆటల వల్ల వినోదంతో పాటు చక్కటి క్రమశిక్షణ, పట్టుదల, ఐక్యమత్యం సమయస్ఫూర్తి, క్రీడా స్ఫూర్తి లాంటి గుణాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నేత్రావతి, డీన్ అరుణ్ కిరణ్, సిబ్యాచ్ ఇన్‌ఛార్జి గంగాధర్, కోఆర్డినేటర్ తిరుమలేశ్వర్, సబితా, పూజ, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జులు దేవికృప, రిషిత, పీఈటీలు శివ, సుహాసిని పాల్గొన్నారు.

గెలుపొందిన విద్యార్థికి ట్రోఫీ, మెడల్‌ను అందిస్తున్న ఏజీఎం సుబ్బారెడ్డి

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గుత్తిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ శ్రీనివాసులురెడ్డి

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని 37 పోలింగ్ కేంద్రాలను గుంతకల్లు రెవెన్యూ డివిజనల్ అధికారి వి.శ్రీనివాసులురెడ్డి సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లపై స్థానిక సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు, మేనేజర్ మురళీధర్, టిపిఎస్ మహబూబ్ జాన్, ఎన్నికల పర్యవేక్షకులు ఇమామ్ హుస్సేన్, సీకే. రామాంజనేయులు, సుధాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్లూరు మండలంలో పరిశీలిస్తున్న అధికారులు

పుట్లూరు : మండల పరిధిలోని కందిగోపుల గ్రామం చింతకుంట, ఎ.కొండాపురం, అరకటివేముల, సూరేపల్లి, కడవకల్లు, సంజీవపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సిఐ సుబ్రమణ్యం సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో విద్యుత్, కిటికీలు, తలుపులు తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హేమాద్రి, సిబ్బంది ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న శివక్రిష్ణ ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు

నార్పల : మండల కేంద్రంలో శివక్రిష్ణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల ప్రవేశ శిక్షణ కేంద్రంలో విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు గౌరవాధ్యక్షులు మెల్లంపూటి సూర్యప్రకాష్ మాట్లాడుతూ అక్షరాస్యత పెంపొందించడమే ట్రస్టు లక్ష్యమన్నారు. ఇందులో భాగంగానే విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇప్పించడంతోపాటు స్టడీ మెటీరియల్స్‌ను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కేంద్రం నిర్వాహకులు లగనేని నాగరాజు, ట్రస్టు ప్రతినిధి కొండిశెట్టి ప్రవీణ్‌కుమార్, విద్యా కమిటీ ఛైర్మన్ గండ్లూరి శ్రీధర్, ఉపాధ్యాయులు కుళ్లాయప్ప, బాబాఫక్రుద్దీన్, పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి హుస్సేన్‌పీరా, స్వచ్ఛంద సేవకులు, యంగ్ ఇండియా నాగభూషణ, విశ్వనాథ్ రెడ్డి, బాబా సలాం తదితరులు పాల్గొన్నారు.

7న ఉరుసు

శింగనమల : మండల కేంద్రంలో ఉన్న మసూద్ స్వామి ఉరుసు ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ ఘనంగా నిర్వహించనున్నట్లు దర్గా ముతవల్లి అబ్దుల్‌రవూఫ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7న గంధంతో ఉత్సవాలు ప్రారంభమై 8న ఉరుసు మహోత్సవం, ఇరుసు పందేలు, అదే రాత్రికి గొప్ప ఖవ్వాలి పోటీలు, 9న అన్నదానం, రాత్రికి తెలుగు, హిందీ పాటల ఆర్కెస్ట్రా ఉంటుందన్నారు. ఉత్సవాల్లో భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.